వైభవంగా దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



దాసాంజనేయస్వామివారిని దర్శించుకుంటున్న మోషేన్‌రాజు



దాసాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పట్టణంలోని గునుపూడి లో ఆదివారం ఉదయం బ్రహ్మశ్రీ ఘంటసాల సోమేశ్వర శర్మ, గాయత్రి దంపతులు, వారి కుమారులు మణి శర్మ, దీక్షిత్ శర్మల ఆధ్వర్యంలో శ్రీ దాసాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ దాసాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో తాను పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. గునుపూడి అంటేనే ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయమని అన్నారు. పంచారామ క్షేత్రాలలో ఒకటైన శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వారి ఆలయంతో పాటుగా అన్నపూర్ణ దేవి ఆలయం, విద్యా గణపతి, సాయిబాబా, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి పోలేరమ్మ అమ్మ వార్ల ఆలయాలు ఉన్నాయని, ఇకపై శ్రీ దాసాంజనేయ స్వామి వారి దర్శనం కూడా భక్తులకు కలగడం అదృష్టమని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావనతో ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. స్వామి వారి విగ్రహం ఏర్పాటుకు, ప్రతిష్ఠకు ఘంటసాల సోమేశ్వర శర్మ కుటుంబ సభ్యులు ముందుకు రావడం వారు పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యఫలమని వెల్లడించారు. బ్రహ్మశ్రీ చెరుకూరి రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ విగ్రహ ప్రతిష్ఠ జరగ్గా, ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు హోమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కోడె విజయలక్ష్మి, మావుళ్లమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, కోడె యుగంధర్, ఆకొండి రాంబాబు, రెడ్డి సత్తిబాబు, కోమటి రాంబాబు, కోటిపల్లి నాగు, మోటుపల్లి విశ్వేశ్వరరావు, కొల్లా చిన్న, చెన్నం శెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామివారిని దర్శించుకున్న మోషేన్‌రాజు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో రైతు బజారు పక్కన ఉన్న బంట్రోతుల వారి వీధిలో ఆదివారం ఉదయం శ్రీ దాసాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పురోహితులు వేదమంత్రాలతో మోషేన్‌రాజును ఆశీర్వదించారు.

రచయితల ద్వారా సమాజ మార్పు

సాక్షి, భీమవరం: సమాజంలో ఉన్న దురాచారాలను రుగ్మతలను పారద్రోరాలంటే కవులు రచయితలకే సాధ్యమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి బియ్యం సాగర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో చుక్కన శ్రీ అధ్యక్షతన అరసం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాగర్ మాట్లాడుతూ ఎందరో అభ్యుదయ రచయితలు కవులు 1936లో ఏర్పాటు చేసిన ఈ సంఘం జాతీయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విస్తృతంగా పనిచేస్తుందన్నారు. ప్రజలు నేడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాజ మార్పు కోసం రచయితలు కవులు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్య పరచాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీలలో తెనాలిలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం .సీతారాం ప్రసాద్ చాంద్ బాషా, పాండురంగారావు,డి రామ నాగేశ్వరరావు, హేమలత సత్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకన్నకు గరుడ సేవ



కాళ్లకూరు వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గరుడ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారికి గరుడ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం మాఘ పౌర్ణమి పర్వదినాన్ని నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదఅమిరం గ్రామానికి చెందిన మంతెన భాస్కర వర్మ దంపతులతో వేద పండితులు గరుడ సేవ జరిపారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పుష్పరాజ్

సాక్షి, భీమవరం: కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని మాలమహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఫొటో సాధన సమితి ప్రజా పోరు యాత్ర గునుపూడి అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆదివారం ర్యాలీ చేపట్టారు. సమితి జాతీయ కమిటీ కన్వీనర్ డాక్టర్ జె. పరుశురాం ఆధ్వర్యంలో ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పుష్పరాజ్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని నోట్లపై ముద్రించాలని కోరారు. కార్యక్రమంలో సంధి జయరాజు, గొర్ల గోపి, చిల్లే రాజ్ కుమార్, కోలాట ప్రసాదరావు, పిట్టా వినోద్ కుమార్, దాసరి చిరంజీవి, చిగురుపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోషేన్‌రాజును కలిసిన రామారావు



మోషేన్‌రాజుతో రాష్ట్ర గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ రామారావు

సాక్షి, భీమవరం: పట్టణాలు, గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సత్తు రామారావు పేర్కొన్నారు. భీమవరంలోని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై చర్చించారు .

సత్తెమ్మ వారిని దర్శించుకున్న సర్రాజు



క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సర్రాజును సత్కరిస్తున్న జాతర నిర్వహకులు.

ఉండి: పెదపుల్లేరు సత్తెమ్మ వారి 58వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున జాతర మహోత్సవానికి తరలివచ్చారు. రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో జాతర కమిటీ చైర్మన్ కలిదిండి కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిర్వహకులు సర్రాజుకు స్వాగతం పలికారు. అనంతరం సర్రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులను సర్రాజు అభినందించారు.

వేద విజ్ఞాన పీఠంలో స్నాతకోత్సవం



వేద విజ్ఞాన పీఠంలో స్నాతకోత్సవంలో విద్యార్థులకు పత్రాలు అందిస్తున్న దృశ్యం

ఆకివీడు: టీటీడీకు చెందిన శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం అయి భీమవరంలో తృతీయ స్నాతకోత్సవ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ పార్లమెంట్ సభ్యుడు, టీటీడీ మాజీ అధ్యక్షుడు కనుమూరి బాపిరాజు 9 మంది విద్యార్థులకు పత్రాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరెడ్డి, మాజీ ఎంపీ, విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, లింగాల సత్యనారాయణ, కేవీఎం కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు లేకుండానే సొంత ఇల్లు

- రూ.2.25 లక్షలకే ఇంటి నిర్మాణం
- లబ్ధిదారులు ముందుకు రావాలని హౌసింగ్ పీడీ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ అల్లూరి వెంకట రామరాజు

ఆకివీడు: సొంతింటి కల నెరవేర్చుకునేందుకు లబ్ధిదారులు అప్పు చేయకుండా ఇల్లు కట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని హౌసింగ్ పీడీ అల్లూరి వెంకట రామరాజు చెప్పారు. మండలంలోని తాళ్లకోడు గ్రామంలోని 74 ఎకరాల జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకోని పట్టాదారులకు సొంత ఇంటి నిర్మాణంపై అవగాహనా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే రూ. 1.80 లక్షలతో పాటు లబ్ధిదారులు రూ. 45 వేలు కలిపి రూ. 2.25 లక్షలతో ఇల్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారని చెప్పారు. తొమ్మిది అడుగుల లోతు పిల్లర్లతో నాలుగు అడుగుల పునాది వరకూ పిల్లర్లు నిర్మిస్తారని చెప్పారు. శ్లాబ్ లెవెల్ వరకూ సిమెంట్ ఇటుకతో నిర్మాణం, 4 అంగుళాల మందంలో శ్లాబ్ నిర్మిస్తారని చెప్పారు. నాలుగు కిటికీలు, రెండు గుమ్మలు, తలుపులు కాంట్రాక్టరే సమకూర్చుతారని చెప్పారు. ఇంటి ముందు భాగం, పునాది వరకూ ప్లాస్టింగ్ చేయించి అప్పగిస్తారని చెప్పారు. లబ్ధిదారులు పునాదుల్లో మట్టి పూడ్చించుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలు రూ. 35 వేలు రుణం తీసుకుంటారని, మరో రూ. 10 వేలు సొమ్ము సమకూర్చుకుంటే సరిపోతుందని చెప్పారు. ఈ విధంగా లబ్ధిదారులు తక్కువ ఖర్చుతో సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు తక్కువ ఖర్చుతో ఇల్లు నిర్మించుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. సచివాలయాల్లో తమ పేర్లను నమోదు చేయించుకుని, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు తెలియజేయాలన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ మాట్లాడుతూ లబ్ధిదారుల్లో అతి పేద కుటుంబానికి చెందిన వారున్నారని వారికి స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఈ విధానాన్ని అమలుజేయించారన్నారు. లబ్ధిదారులకు మంచి అవకాశం వచ్చినందును ముందు కురావాలని తెలిపారు. కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం మూడు కిటికీలే ఉన్నాయని, మరో కిటికీ వాస్తు ప్రకారం అవసరమని చెప్పడంతో ముందుకు వచ్చారన్నారు. బేస్‌మెంట్ రెండున్నర అడుగుల నుంచి నాలుగు అడుగులకు పెంచామని, బేస్‌మెంట్ లెవిల్‌కు ప్లాస్టింగ్ చేయాలని కోరిన మీద కాంట్రాక్టర్ ఒప్పుకున్నందున రూ.2.25 లక్షలతో ఇల్లు నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. సమావేశంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు తిరుమారెడ్డి మాధవి, దొడ్డి జగదీష్, గుండుగొలను సావిత్రీ, మన్నే లలితాదేవి, ఎంపీటీసీ సభ్యుడు బంటుమిల్లి పుణ్యవతి, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షురాలు గాలి సామ్రాజ్యం, గుండా సుందరరామనాయుడు, ఎండీ మదనీ, ఎండీ. సిద్దిక్, మన్నే పోతరాజు, షేక్ హుస్సేన్, మోరా జ్యోతి, యర్రా కేశవ, అందే రాజబాబు, ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత



గుంటూరు ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్న సంధ్యారాణి



ఏలూరు ఆశ్రమం ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ కళ్యాణి సాయి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రతి నెలా వలంటీర్లు, సచివాలయం సిబ్బంది దూర ప్రాంతాల్లో ఆపదలో ఉన్న పింఛన్ లబ్ధిదారులకు వద్దకు వెళ్లి పెన్షన్ అందించి వారి తమ సేవాతత్వాన్ని నిరూపించుకుంటున్నారు. ఈ నెల పింఛన్‌కు సంబంధించి కూడా పలువురు వలంటిర్లు, సచివాలయం సిబ్బంది కూడా దూర ప్రాంతంలో పెన్షన్ లబ్ధిదారులకు వద్దకు వెళ్లి పెన్షన్ అందించారు. భీమవరం 22 వార్డుకు చెందిన జోగా వెంకట అప్పారావు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. ఆపదలో ఉన్న ఆయనకు పింఛన్ అందించాలని తన వంతు సహాయం చేయాలని ఆ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ కరణం సంధ్యారాణి ఆదివారం గుంటూరు వెళ్లి అప్పారావుకు రూ.10 వేలు పింఛన్ అందించింది. అలాగే భీమవరం 39 వార్డుకు చెందిన పెన్షన్ లబ్ధిరాలు గొల్లగాని శ్రీదేవి ఏలూరు ఆశ్రమం ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకుంది. అయితే వార్డు వలంటీర్ బర్మా కళ్యాణీ సాయి ఆదివారం ఏలూరు వెళ్లి శ్రీదేవికి పింఛన్ అందించింది. పెన్షన్ అందుకున్న శ్రీదేవి సంతోషం వ్యక్తం చేసి అభినందించినట్లు వలంటీర్ కళ్యాణి సాయి తెలిపారు.

జగన్ పాలనలోనే క్రైస్తవులకు గౌరవం



ట్రినిటీ లూథరన్‌చర్చ్‌లో జాన్సన్ దంపతులను సత్కరిస్తున్న చర్చ్ ప్రతినిధులు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలోనే క్రైస్తవులకు సరైన గౌరవం లభిస్తుందని వైఎస్సార్ సీపీ క్రిష్టియన్ మైనారిటీ రాష్ట్రాధ్యక్షుడు మేడిద జాన్సన్ అన్నారు. ఆదివారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్చ్ సంఘ పెద్దలు, పీసీసీ సభ్యులు, కార్యదర్శి, స్త్రీల సమాజం,యూత్ ప్రతినిధులు జాన్సన్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పేరిష్ పాస్టర్ రెవరెండ్ వి.నెహ్రూ, అడిషనల్ పాస్టర్ బి.డేవిడ్‌లివింగ్‌స్టన్, సీఆర్ డి.సునీల్‌కుమార్, సంఘపెద్దలు ఆలమూరి శ్యాంబాబు, గుమ్మడి అమృతరావు, చుక్కా శేఖర్, ముత్యం కుమార్, పీసీసీ చికిలే వెంకట్, చిగురుపాటి కర్నేలు, కార్యదర్శి ముత్యం అనిల్, పొట్ల విమల తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు తవ్వకానికి భూమి పూజ



చెరువు తవ్వకానికి భూమి పూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవిఎల్ నర్సింహరాజు

ఆకివీడు: మండలంలోని కాళింగ గూడెం గ్రామంలో మంచినీటి చెరువు తవ్వకానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు చిరకాలంగా పడుతున్న ఇబ్బందులకు తెరపడిందని చెప్పారు. త్వరితగతిన మంచినీటి చెరువు తవ్వకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురువెల్లి అన్నపూర్ణ, ఎంపీపీ కటారి జయలక్ష్మి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేసిరెడ్డి మురళి పాల్గొన్నారు.

ఘనంగా మావుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయ 59 వార్షికోత్సవ మహోత్సవాల్లో ఆదివారం సాయంత్రం 5 గంటలకు బి.సత్యకుమార్ భీమవరం వారితో కూచిపూడి జానపద నృత్యాలు, రాత్రి 7 గంటలకు మావుళ్లమ్మ నాట్యమండలి భీమవరం వారితో కురుక్షేత్రం నాటకం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నీరూల్లికూరగాయ పండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటి సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షికోత్స ఉత్సవాల్లో సోమవారం సాయంత్రం 5 గంటలకు మౌనిక ఆర్కెస్ట్రా భీమవరం వారితో సినీ మ్యూజికల్ నైట్ , 8 గంటలకు సత్యహరిశ్చంద నాటిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

విజేతలకు బహుమతుల అందజేత

సాక్షి, భీమవరం: అంకాల ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రంధి అప్పారావు స్మారక చిత్రకళ పోటీలు నిర్వహించారు. పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో 138 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు గ్రూపులుగా విభజించి విజేతలను ప్రకటించి ఆదివారం బహుమతులు అందజేశారు. అదే విధంగా పాల్గొన్న 138 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమి అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి వెంకట్రావు, కాగిత వెంకటరమణ, కోశాధికారి గోపా సత్యనారాయణ, పరిమి రామకృష్ణ, గ్రంధి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పాలకోడేరు: కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి కోడిపందేల రాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన ఇది. పోలీసులు కథనం ప్రకారం మోగల్లు పంచాయతీ పరిధిలో ఉన్న గుత్తుల వారి పాలెంలో కోడిపందేలు నిర్వహిస్తుండగా ఆదివారం ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తన సిబ్బందితో దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.3,150 నగదు రెండు కోళ్లు రెండు కత్తులు స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. వీరిని భీమవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు తెలిపారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారు.. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

వైభవంగా లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామ శివారు సత్యనారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విద్య ప్రకాశానందగిరి విగ్రహ ప్రతిష్ఠ కూడా చేశారు. ఈ సందర్భంగా నాలుగు వేదాలు, భగవద్గీత పారాయణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత గాదిరాజు చిన అప్పలరాజు, లక్ష్మి దంపతులు పూజలూ నిర్వహించి, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు సమక్షంలో నిర్వహించారు. అలాగే శ్రీ లక్ష్మి నారాయణ బాల భక్త సమాజం వారితో హరినామ సంకీర్తనతో పాటు జీహెచ్ఎల్ నారాయణరాజు 4 వేదాలు తమ గాత్రం తో అందరినీ మైమరపించే విధంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో చుండూరి సత్యవతి, కొండ్రెడ్డి కల్యాణి, దండు అనసూయ, భూపతిరాజు రాధ, ఆరేటి తులసీ, ఏడ్రి సత్యవతి పాల్గొన్నారు.

11న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

పెనుగొండ: చివటం సత్యనారాయణ నాగరత్నం స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 11న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చివటం సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పార్కు వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు షీల్డ్‌లతో పాటు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు నగదు, రెండో బహుమతిగా రూ.2 వేలు నగదు, మూడో బహుమతిగా రూ.1000 నగదు, కన్సోలేషన్ బహుమతులు ఇద్దరికి రూ.500 వంతున ఇస్తామన్నారు. పోటీలకు ఎలాంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మిగిలిన వివరాలకు 98495 28590 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

జానపద కళలను ప్రోత్సహించాలి

పాలకొల్లు అర్బన్: అంతరించిపోతున్న జానపద కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలపైనా ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ క్షీరారామ లింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం బుర్రకథ కళాకారులను సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేసే ప్రాచీన కళలైన బుర్రకథ, హరికథలను ప్రోత్సహించాలన్నారు. బుర్రకథ కళాకారులు యడవల్లి దుర్గాప్రసాద్, యడవల్లి సుభద్రమ్మ, నక్కా రామారావు, కృష్ణమూర్తి, షేక్ ఖాదర్‌వల్లి, కంజరి కథకుడు కారెం శ్రీనివాస్‌లను శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కావలి నగేష్, కానూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

ఉండి: మండలంలోని 19 గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం విలేకరులకు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించే మొదటి సమావేశంలో ఉండి, చెరుకువాడ, అర్తమూరు, కలిసిపూడి, పెదపుల్లేరు, చినపుల్లేరు, కోలమూరు, పాములపర్రు గ్రామాలవారికి ఉండి వ్యవసాయ మార్కెట్‌యార్డులో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండో సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు మహదేవపట్నంలోని సీతారామ కల్యాణ మండపంలో మహదేవపట్నం, చిలుకూరు, వెలివర్రు, వాండ్రం, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాలకు నిర్వహిస్తున్నారు. అలాగే 4 గంటలకు యండగండి రైతు భరోసా కేంద్రంలో యండగండి, ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ, ఉప్పులూరు గ్రామాలవారికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తప్పనిసరిగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్‌లు పాల్గొనాలని కోరారు.

సీపీఎస్ రద్దు చేయాలని సంకల్ప దీక్ష

సాక్షి, భీమవరం: సీపీఎస్ రద్దు కోరుతూ ఆదివారం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమవరంలో ఒకరోజు సంకల్ప దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు మద్దతు ఎమ్మెల్సీ షేక్ సాబ్జి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోరుతూ శాసన మండలిలో పోరాడతామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, పి.విజయరామరాజు, కె.రాజారావు, జి.జేమ్స్, కె.శ్రీదేవి, సీహెచ్ పట్టాభి రామయ్య, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.